www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 30 జనవరి 2025

తప్పులుంటే సవరించుకోండి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: జిల్లాలోని జెడ్పి, మండల, మున్సిపల్ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులు వ్యక్తిగత డేటా టిఐఎస్‌లో తప్పులుంటే సవరించుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారిణి వరలక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 31వ తేదీ వరకు టిఐఎస్ సవరణలకు అవకాశం కల్పించినట్లు పేర్కొన్నారు. టిఐఎస్ అర్హతను బట్టి ఉపాధ్యాయులు పదోన్నతులుంటాయని తెలిపారు.

రెవెన్యూ సిబ్బంది దాష్టీకం

- దళితుల స్థలంలో మామిడి, కొబ్బరి చెట్లు పీకేసిన వైనం
- కలెక్టరేట్ ఎదుట నిరసనకు దిగిన రైతులు

పీకేసిన మొక్కలతో కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న దళితులు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: దళితులకు భూములిస్తాం... దళితుల భూములు ఎవరూ కొనరాదు.. దళితులను అన్ని విధాలుగా ఆదుకుంటాం.. అధికార పక్షమైనా, ప్రతిక్షమైనా చెప్పే మాటలివి.. ఇందుకు భిన్నంగా జిల్లాలోని ఎస్ఆర్‌పురం మండలం పాతపాళ్యం దళితవాడలో 30 ఏండ్లుకు పైగా సాగు చేస్తున్న దళితుల భూమల్లోని మామిడి, కొబ్బరి, మల్లబరీ చెట్లును రెవెన్యూ అధికారులు పీకేశారు. అక్కడుకున్న దళితులను నానా భూతులు తిడుతూ కులంపేరిట దూషించడమే కాకుండా దళితల మహిళలపై అనుచితంగా ప్రవర్తించారు. అగ్రవర్గాలు, బిసి కులాలు ప్రభుత్వ డికేటి భూములున్నా కేవలం దళితల భూముల్లోని చెట్లు పీకేయడం పట్ల దళిత సంఘాలు ప్రజాసంఘాలు రెవెన్యూ సిబ్బంది తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఇదే దళితుల పట్ల ప్రభుత్వ చిత్తశుద్ధి అంటూ ప్రశ్నస్తున్నారు.

30 ఏండ్లకు పైగా ఎస్ఆర్‌పురం మండలం పాతపాళ్యం సమీపంలోని ప్రభుత్వ భూమిని అగ్రకులస్తులు, బిసిలు, దళితులు తలాకొంత భూమిని సాగు చేసుకుంటున్నారు. పలుకుబడి కలిగిన అగ్రకులస్తులు కొందరు రెవెన్యూ అధికారులను ప్రలోభపెట్టి డికేటి పట్టాలు సాధించారు. రెవెన్యూ అధికారులు అడినంత ఇచ్చేకొలేని పేదలకు రెవెన్యూ అధికారులు పట్టాల్విలేదు. అదే గ్రామానికి చెందిన తలారి శివకుమార్ ఐదెకరాల స్థలానికి పట్టా పొందారు. సెంటు భూమి లేని దళితులు తమ ఆధీనంలో ఉన్న భూమిలో కొబ్బరి, మామిడి, మల్లబరీ చెట్లును పెంచుతున్నారు. రెవెన్యూ సిబ్బంది అడిగినంత ఇవ్వలేదనే అక్కసుతో రెండు రోజుల క్రితం ఎస్ఆర్‌పురం మండల వీఆర్ఓ, రెవెన్యూ సిబ్బంది దళితులైన వెంకటేష్, దాక్షాయని భూమిలోని కొబ్బరి, మామిడి మొక్కలతో పాటు మల్లబరీ మొక్కలను పీకేశారు. తాము దళితులంటూ కాళ్ళావేళ్లాపడ్డా పట్టించుకోకుండా కేవలం దళితుల భూమిలోని చెట్లను పీకేయడంతో ఆగ్రహానికి గురైన పాతపాళ్యం దళితులు రెవెన్యూ సిబ్బంది పీకేసిన మొక్కలతో ఇదెక్కడి న్యాయమంటూ బుధవారం కలెక్టరేట్‌కు చేరుకొని నిరసనకు దిగారు. ఇందులో కొందరు దళితులకు రెవెన్యూ అధికారులు జారీ చేసిన డీకేటి పట్టాదారు పాసుపుస్తకాలు ఉన్నాయి.

కష్టపడి మొక్కలు నాటాం..

- వెంకటేష్, బాధితుడు

అప్పు చేసి మామిడి, కొబ్బరి మొక్కలు తీసుకొచ్చి నాకు ఉన్న ఎకరం స్థలంలో నాటుకున్నాం. సమీపంలోని బోరు నుండీ నీటిని తీసుకొని మొక్కలు పెంచుకుంటున్నాం. అయితే రెవెన్యూ అధికారులు ఎంత వేడుకుంటున్నా వినకుండా మొక్కలన్నింటినీ పీకేశారు. నాకు ఈ భూమి మాత్రమే ఉంది. ఈ భూమిని నమ్ముకునే జీవనం సాగిస్తున్నాము. దళితులమని ఇంత అన్యాయం చేయడం దారుణం.

అనుచితంగా ప్రవర్తించారు..

- దాక్షాయణి, బాధితురాలు

దళిత మహిళ అని కూడా చూడకుండా విఆర్ఒ అనుచితంగా ప్రవర్తించారు. డబ్బులిస్తే తప్ప భూమిలో అడుగుపెట్ట కూడదని చెప్పులేని విధంగా బూతులు తిట్టారు. ఈ విషయం విఆర్ఒ కుటుంబ సభ్యుల దృష్టికి తీసుకుపోయాను. వాళ్ళు కూడా కులం పేరుతో దూషించారు. రెవెన్యూ సిబ్బంది అడిగిన డబ్బులు ఇవ్వలేదనే మా పొలంలోని మొక్కలు పీకేశారు. జిల్లా అధికారులు దళితులకు జరుగుతున్న అన్యాయంపై స్పందించి మాకు న్యాయం చేయాలి.

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు
భూమి కేటాయింపు : కలెక్టర్

కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: జిల్లాలో పరిశ్రమల స్థాపనకు ముందుకు వచ్చే ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు అవసరమైన భూమి కేటాయింపులపై దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా సచివాలయంలోని సమావేశపు మందిరంలో జిల్లా పరిశ్రమలు, ఎగుమతి ప్రోత్సాహక కమిటీ సమావేశం జిల్లా పరిశ్రమల కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పరిశ్రమల స్థాపనకు తద్వారా ఉపాధి అవకాశాల కల్పనపై ప్రత్యేక దృష్టి పెట్టిందని, నూతన పారిశ్రామిక విధానాన్ని అమలు చేయడం జరుగు తుందని దీని మేరకు జిల్లాలో పరిశ్రమల స్థాపన ద్వారా ఆర్థిక పురోభివృద్ధితో పాటు ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయని ఈ దిశగా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. పరిశ్రమల స్థాపన కొరకు భూమి కేటాయింపులకు సంబంధించి ఆన్లైన్లో రిజిస్టర్ చేసుకున్న వారిలో తిరస్కరించబడిన ఔత్సాహిక పారిశ్రామికవేత్తలతో జిల్లా పరిశ్రమల కేంద్రం అధికారులు, ఏపీఐఐసీ అధికారులు సమావేశం నిర్వహించాలన్నారు. భూమి కేటాయింపులకు సంబంధించి నియమ నిబంధనలను అనుసరించడం పై అవగాహన కల్పించాలని తద్వారా ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు దీనిపై అవగాహన పెరుగుతుందని తెలిపారు. జిల్లాలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి ఇప్పటి వరకు రూ.544 కోట్లతో 59,044 మందికి ఉపాధి కల్పించేలా 14,761 సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల ఏర్పాటుకు ఉదయం పోర్టల్ దరఖాస్తులు స్వీకరించడం జరిగిందన్నారు. సింగల్ డెస్క్ పోర్టల్ కింద 19 డిసెంబర్ 2024 నుండి 28 జనవరి 2025 వరకు 109 దరఖాస్తులు స్వీకరించగా 71 దరఖాస్తులకు అనుమతులు మంజూరు చేయడమైనదని తెలిపారు. ప్రధానమంత్రి ఉపాధి కల్పన కింద రూ.4.73 కోట్లతో 131 యూనిట్ల ఏర్పాటుకు అనుమతులు మంజూరు చేయడమైనదన్నారు. పిఎం విశ్వకర్మ యోజన కింద 1,560 మందికి శిక్షణ అందించడమైనదని తెలిపారు. జిల్లాస్థాయి ప్రాథమిక తనిఖీ కమిటీ ద్వారా 176 ఎంఎస్ఎంఈలకు రూ.10.90కోట్లు ప్రోత్సాహకాలు అందించడం జరిగిందని తెలిపారు. ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఎంఎస్ఎంఈల ఏర్పాటుకు అవగాహన కార్యక్రమాల నిర్వహణలో భాగంగా గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది ద్వారా 28 జనవరి 2025 నుండి ఇప్పటి వరకు 14,280 ఎంఎస్ఎం ఈ యూనిట్లను సర్వే చేయడం జరిగిందని, ఈ ప్రక్రియ ఫిబ్రవరి 1వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు. సమావేశంలో జిఎం ఇండస్ట్రీస్ వెంకట్ రెడ్డి, డిప్యూటీ చీఫ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ రామకృష్ణారెడ్డి, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ సుబ్బారావు, ఎల్డీఎం హరీష్, డిపిఓ సుధాకర్ రావు, వ్యవసాయ, ఉద్యానవన శాఖల అధికారులు మురళి కృష్ణా, మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు.

గ్రీవెన్స్‌లో
ఈవ్ టీజింగ్‌పై ఫిర్యాదు చేయవచ్చు
చైల్డ్ కేర్ హెల్ప్ లైన్ పై ప్రజలకు అవగాహన

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: పాఠశాలల్లో కళాశాలల్లో విద్యార్థులను వేధించడం, ఈవ్ టీజింగ్ సమస్యలు ఉన్నట్లయితే సోమవారం గ్రీవెన్స్‌లో కలెక్టర్, జేసీలకు ఫిర్యాదు చేయవచ్చని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం జిల్లా సచివాలయంలోని సమావేశ మందిరంలో మిషన్ వాత్సల్య పథకం అమలు తీరుపై కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ ఛైర్మన్ అధ్యక్షతన నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రధానంగా సమాజంలో మహిళలు, పిల్లలపై జరుగుతున్న అఘాయిత్యాలను, వేధింపుల నుంచి వారిని కాపాడేందుకు, చైల్డ్ మ్యారేజ్‌ను అరికట్టేందుకు సంబంధిత శాఖలన్నీ సమన్వయంతో క్షేత్రస్థాయి వరకు పనిచేయాల్సిన అవసరం ప్రాధాన్యత ఉందని అన్నారు. పాఠశాలల్లో కళాశాలల్లో చదివే విద్యార్థులు వేధింపులకు గురైతే ప్రతి సోమవారం కలెక్టరేట్ లో జరిగే గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు జిల్లా జాయింట్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేయవచ్చునని తెలిపారు. దీంతో పాటు మండలస్థాయిలో ఎంఈవోలు ఉపాధ్యాయులతో కూడా కమిటీని ఏర్పాటు చేయాలని ఇలాంటి సమస్యలు ఎదుర్కొంటున్న విద్యార్థులకు ధైర్యం చెప్పి సమస్య నుండి బయటపడేలా చర్యలు చేపట్టాలన్నారు. ఐసిడిఎస్ ద్వారా నిర్వహిస్తున్న చైల్డ్‌కేర్ ఇన్స్టిట్యూషన్స్‌లో పటిష్టమైన భద్రత ఉండాలని పిల్లల భద్రతతో పాటు వారి కందించే అన్ని వసతుల గురించి తెలుసుకొని లోటుపాట్లు ఉంటే సరిదిద్దాలని తెలిపారు. చైల్డ్ కేర్ హెల్ప్‌లైన్, ఆడపిల్లలు మహిళల సంరక్షణకు సంబంధించిన చట్టాలపై విస్తృతంగా అవగాహన కలిగేలా స్త్రీ శిశు సంక్షేమశాఖ ద్వారా పోస్టర్స్ బ్యానర్లను ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. లేబర్ డిపార్ట్మెంట్ ద్వారా చైల్డ్ లేబర్‌ను గుర్తించి క్షేత్రస్థాయిలో సంబంధిత శాఖలన్ని సమన్వయంతో ఈ అంశంలో పని చేయాలని ఆదేశించారు. సమావేశంలో గౌరవ సీనియర్ సివిల్ జడ్జి, డిఎల్ఎస్ఎ సెక్రటరీ ఎంఎస్.భారతి, ఐసిడిఎస్ పిడి వెంకటేశ్వరి, జడ్పీ సీఈఓ రవికుమార్ నాయుడు, డిఎం అండ్ హెచ్ఓ డాక్టర్ సుధారాణి, డీఈఓ వరలక్ష్మి అధికారులు పాల్గొన్నారు.

ఫైరింగ్ ప్రాక్టీసు ప్రారంభం

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ఏఆర్. మొబిలైజేషన్‌లో భాగంగా జరుగుతున్న ఫైరింగ్ ప్రాక్టీసును జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు ఆదేశాల మేరకు ఏఆర్ అడిషనల్ ఎస్పీ శివానంద కిషోర్ బుధవారం పరిశీలించారు. గంగాధర్ నెల్లూరు వద్ద గల చిత్తూరు పోలీస్ డిపార్టుమెంటుకు చెందిన ఫైరింగ్ రేంజ్‌లో సివిల్, ఏఆర్. సిబ్బంది, అధికారులకు ఫైరింగ్ ప్రాక్టీసు నిర్వహించారు. అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణలో సాయుధ దళ పోలీసుల సేవలు చాలా కీలకమని అత్యవసర సమయాలలో ప్రజల, ప్రభుత్వ, ధన ప్రాణ రక్షణకై ఎల్లవేళలా సంసిద్ధులై ఉండాలని అన్నారు. సివిల్ పోలీసులు శాంతి భద్రతలను నిరంతరం పరిరక్షిస్తూ ఉంటారని కావున ఫైరింగ్‌లో ప్రతి ఒక్కరు పాల్గొని మంచి మెళకువలు నేర్చుకొని, ఫైరింగ్‌లో ఉన్న అనుమానాలను నివృత్తి చేసుకోవాలని సూచించారు. ఫైరింగ్ రేంజ్‌లో క్రమశిక్షణ అత్యంత ప్రాముఖ్యం వహిస్తుందని కావున ఫైరింగ్ రేంజ్ అధికారుల సూచనల మేరకు ఫైరింగ్ ప్రాక్టీసెస్‌ను జాగ్రత్తగా చేయాలని ఆదేశించారు. అనంతరం పోలీసు అధికారులు, సిబ్బందికి ఫైరింగ్ ప్రక్రియ గురించి పలు సూచనలు తెలియజేశారు. ప్రతి ఒక బుల్లెట్టు లక్ష్యం వైపే బుల్ పడే విధంగా తర్ఫీదు పొందాలని సూచించారు. అదేవిధంగా అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని జిల్లా పోలీసు శాఖ ఉన్నతి కోసం ముందడుగు వేయాలని తెలిపారు.

ఫైరింగ్ ప్రాక్టీస్ చేస్తున్న పోలీసులు

మొగలి ఆలయం అభివృద్ధికి చర్యలు : కలెక్టర్

- జవాన్ కుటుంబానికి కోటి రూపాయలు

ఆలయాధికారులు, ఎమ్మెల్యేతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: మొగలి ఆలయం అభివృద్ధికి చర్యలు చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా బంగారుపాళ్యం మండలం మొగలి ఆలయాన్ని పూతలపట్టు ఎమ్మెల్యే కె.మురళిమోహన్‌తో కలసి వెళ్ళి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి అవసరమైన చర్యలు చేపట్టడం జరుగుతుందని పురాతన శివాలయంను మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. టేకుమంద జెడ్‌పి హైస్కూల్‌ను పరిశీలించిన కలెక్టర్ పాఠశాలలో కాంపౌండ్ వాల్, ఆట స్థలం ఏర్పాటు చేయాలని ఉపాధ్యాయులు కోరగా ఈ అంశాన్ని పరిశీలించి చర్యలు చేపడతామని తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మొగలి ఆలయం అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. బంగారుపాళ్యం మండలం ఎగువరాగిమాను పెంటకు చెందిన వీర జవాన్ కార్తీక యాదవ్ కుటుంబాన్ని ఆదుకుంటామని, కలెక్టర్ వారు పంపిన ప్రతిపాదనల మేరకు కోటి రూపాయలు ఆర్థిక సహాయం అందజేసేందుకు ప్రభుత్వం అంగీకరించిందని, 5ఎకరాల వ్యవసాయ పొలంకు సంబంధించిన పట్టాను వీర జవాన్ కర్మ క్రియలు చేసే రోజున అందజేస్తామని తెలిపారు. తహశీల్దార్ బాబు రాజేంద్ర ప్రసాద్, టిడిపి అధ్యక్షులు జయప్రకాష్ నాయుడు, ధరణి, కోదండ యాదవ్ పురోహితులు శ్రీనివాస్ శర్మ, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీలను క్రమబద్ధీకరించాలి

- సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీ అమలు చేయాలి
- రాష్ట్రపతికి లేఖలు రాసిన అంగన్వాడీలు

మాట్లాడుతున్న యూనియన్ గౌరవాధ్యక్షులు గంగరాజు

ప్రజాశక్తి- కార్వేటినగరం: అంగన్వాడీలను కోర్టు తీర్పు ప్రకారం క్రమబద్ధీకరించాలని, గ్రాట్యూటీ అమలు చేయాలని దేశవ్యాప్త ఉద్యమంలో భాగంగా బుధవారం కార్వేటినగరం ప్రాజెక్టు అంగన్వాడీలు సిఐటియు ఆధ్వర్యంలో రాష్ట్రపతికి లేఖలు రాశారు. ఈ సందర్భంగా ఏపీ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షుడు వాడ గంగరాజు, ప్రాజెక్టు అధ్యక్ష, కార్యదర్శి విజయ, మమత మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్వాడీలను నిర్లక్ష్యం చేస్తున్నారని కోర్టు తీర్పు ప్రకారం ఐసిడిఎస్‌ను సంస్థాగతం చేయాలని డిమాండ్ చేశారు. 50 సంవత్సరాల అవుతున్న ఇప్పటివరకు సంస్థాగత చేయకపోవడం దారుణమన్నారు. శిశు, మరణాలు రేటు తగ్గించడంలో కీలకపాత్ర పోషిస్తున్న అంగన్వాడీల సమస్యలను పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. సంవత్సరాల కొద్దీ పనిచేస్తున్న అంగన్వాడీలపై పనిభారం పెంచి రకరకాల పద్ధతుల్లో మానసిక ఒత్తిడికి గురిఅవుతున్నారని తెలిపారు. దానికి తోడు మూలకే నక్కపై తాటికాయ పడ్డట్టు అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ అంగన్వాడీల దగ్గర డబ్బులు వసూలు చేసే కార్యక్రమం తీవ్రమైందన్నారు. జిల్లాలోనే అత్యధికంగా పోషణ వాటిక సెంటర్లను నిర్వహించడం అధికారులకు కాసులు పంటగా మారిందని తెలిపారు. ప్రతి వర్కరు హెల్పరు తుమ్మినా, దగ్గినా డబ్బులు వసూలు చేస్తూ ఇవ్వని వారిపై మెమోలు ఇస్తామని బెదిరిస్తున్నారు. దీంతో అంగన్వాడీలు మానసిక ఒత్తిడికి లోనవుతున్నారని, ఒకసారి పోషణ వాటిక సెంటర్లను ఇచ్చిన తర్వాత మార్చే పద్ధతి లేదని అయినా బలవంతంగా పోషణ వాటిక సెంటర్లను మార్పు చేస్తున్నారని, అధికారుల ఒత్తిడి మానకపోతే నిరంతరం పోరాటం చేస్తామని తెలిపారు. ప్రాజెక్టులో ఒకరిద్దరు నాయకులుగా చెలామణి అవుతూ అధికారులకు తొత్తులుగా ఉంటూ అంగన్వాడీలను బెదిరించే పనిచేయడం మానుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రెడ్డమ్మ, ఎస్ఆర్ పురం సెక్టార్ లీడర్లు అంగన్వాడీలు పాల్గొన్నారు.

అటవీ భూములు ఆక్రమణ పై సమగ్ర విచారణ చేసి
అక్రమ పట్టాలు రద్దు చేయాలి: సిపిఎం

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: పులిచెర్ల మండలం మంగళంపేట వద్ద అటవీ భూముల ఆక్రమణపై సమగ్ర విచారణ చేపట్టి అవినీతికి పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకోవాలని, భూములు స్వాధీనం చేసుకోవాలని సిపిఎం జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో అటవీశాఖ మంత్రిపై పలు ధపాలుగా ఆక్రమణలపై కోకొల్లలుగా ఫిర్యాదు వస్తున్నాయని వాటిపై సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. రెవెన్యూ రికార్డుల్లో అంకెలు తప్పులు తడకగా ఉన్నాయని రెవెన్యూ అధికారులు ఎవరు అధికారంలో ఉంటే వారికి తొత్తులుగా వ్యవహరించడం దారుణమన్నారు. రైతులు, సామాన్యులు ఎవరైనా కొద్దిగా ఆక్రమిస్తేనే గగ్గోలు పెట్టే అధికారులు పెద్దలు ఇచ్చే కమిషన్లకు కక్కుర్తి పడి నిబంధనలను తొక్కుతున్నారనీ విమర్శించారు. చట్టం ఎవరికైనా సమానమే గాని డబ్బులు ఉన్న వారికి ఒక రకంగా సామాన్యులకు మరో రకంగా ఉండదని తెలిపారు. అటవీ భూముల్లోకి రైతులు గొర్రెలు పెంపకం దారులు ఎవరైనా అడుగుపెడితే దౌర్జన్యం చేస్తున్న అటవీ అధికారులు పెద్దలకు మాత్రం రెడ్ కార్పెట్ పరిచి భూములు స్వాధీనం చేయడం ఏమిటి అని ప్రశ్నించారు. మంగళంపేట రెవెన్యూ పరిధిలో సర్వేనెంబర్ 295, 296లో ఉన్న భూములపై సమగ్ర విచారణ చేయాలని డిమాండ్ చేశారు. రికార్డులో అదనంగా 52 ఎకరాలు భూమి ఎక్కడి నుంచి వచ్చిందో తేల్చాలని డిమాండ్ చేశారు. అటవీ భూములను ఆక్రమించుకొని రెవెన్యూ పట్టాల్లో కలుపుకొని ఆన్లైన్‌లో ఎక్కించడం దుర్మార్గమన్నారు. పుంగనూరు నియోజకవర్గంలో గత ఐదు సంవత్సరాలుగా భూ దందాలు తారాస్థాయి చేరుకున్న గతంలో కూడా సోముల మండలం పెద్దవుప్పరపల్లె వద్ద 700 ఎకరాలు అటవీ భూములను ఆక్రమించారని వెలుగులోకి వచ్చింది. ఇప్పటికైనా ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం అయినా ఆక్రమణ గురైన భూములపై సమగ్ర విచారణ చేపట్టి ప్రభుత్వ భూమిని కాపాడి పేదల అనుభవంలో ఉన్న భూములకు పట్టాలు ఇవ్వాలని సిపిఎం డిమాండ్ చేస్తున్నది. ప్రభుత్వం స్పందించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

అభి'వంద'నలు..!

- జిఎస్ఎల్‌వి-ఎఫ్ రాకెట్ ప్రయోగం సక్సెస్
- సూర్యోదయం వేళ..
- చలిని సైతం లెక్కచేయక
- షార్‌లో విద్యార్థులతో కలెక్టర్ సందడి



విద్యార్థులతో కలెక్టర్ వెంకటేశ్వర్

ప్రజాశక్తి - సూళ్లూరుపేట: 'బుధవారం తెల్లవారుజామున ఉషోదయం ముందా... ఉపగ్రహం ముందా' అన్నట్లుగా సూరీడు, రాకెట్ ప్రయోగం పోటీ పడ్డాయి.. బుధవారం ఉదయం 6.23 గంటలకు రోదసిలోకి సక్సెస్ ఫుల్‌గా జిఎస్-ఎల్‌వి-ఎఫ్ 15 రాకెట్ ద్వారా ఎన్‌విఎస్-2 ఉపగ్రహం విజయవంతంగా అంతరిక్షంలోకి దూసుకెళ్లింది.

అంబరాన్నంటిన సంబరాలు

జిఎస్ఎల్‌వి-ఎఫ్15 రాకెట్ ప్రయోగాన్ని సైన్స్ ఫెయిర్‌లో ప్రతిభచూపిన సూళ్లూరుపేట ఉన్నత పాఠశాల విద్యార్థినీ విద్యార్థులు వీక్షించారు. దాదాపు 500 మంది గ్యాలరీ నుంచి వీక్షించే ఏర్పాటు చేశారు. అలాగే తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ దంపతులు సైన్స్ ఫెయిర్‌లో అద్భుత ప్రతిభ చూపిన సూళ్లూరుపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థి ఎస్‌కె ఆఫ్రీద్‌ను, పదో తరగతి విద్యార్థిని ఎస్.హిమహన్షినిని ఇస్రో రాకెట్ ప్రయోగ వీక్షణకు తమతోపాటు తీసుకెళ్లారు. కలెక్టర్ ఇస్రో బృందానికి శుభాకాంక్షలు తెలిపారు. వారితో కలిసి ఫొటోల్లో పాలుపంచుకున్నారు. భారతకీర్తిని ప్రపంచపటంలో ఉన్నత స్థానంలో నిలుపుతున్న ఇస్రో బృందాన్ని కలెక్టర్ కొనియాడారు. ఈ కార్యక్రమంలో సూళ్లూరుపేట ఆర్డీవో కిరణ్మయి ఉన్నారు.

చలిని సైతం లెక్కచేయని వీక్షకులు

బుధవారం ఉదయం 6.23 గంటలకు జిఎస్ఎల్‌వి-ఎఫ్15 నిప్పులు చిమ్ముకుంటూ ఆకాశంలోకి తారాజువ్వలా దూసుకెళ్లింది. ఈ ప్రయోగాన్ని వీక్షించేందుకు దేశ నలుమూలల నుంచి చిన్నపెద్ద తేడా లేకుండా తెల్లవారుజామున చలిని సైతం లెక్కచేయకుండా శ్రీహరికోటలో ఏర్పాటు చేసిన గ్యాలరీకి చేరుకున్నారు. జాతీయ జెండాలు చేబూని 'జయహో భారత్' అంటూ నినాదాలు చేశారు. రాకెట్ ఘన విజయంతోవ ఆరి ఆనందానికి హద్దులు లేకుండా పోయింది.

ఇస్రో 100వ ప్రయోగం విజయవంతం

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: ఇస్రో 100వ ప్రయోగం విజయవంతమైనట్టు ప్రధానోపాధ్యాయులు అబ్దుల్ సుభాన్ తెలిపారు. బుధవారం మండలంలోని టేకుమంద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇస్రో 100 ప్రయోగం విజయవంతం పై ఇస్రోకు అభినందనలు తెలిపారు. ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ ప్రయోగించిన నూరవ ప్రయోగం విజయవంతం అయిన సందర్భంగా పాఠశాలలోని కలాం సైన్స్ క్లబ్ సభ్యులు ఇస్రో 100 ఆకారంలో కూర్చొని ఇస్రో బృందాన్ని అభినందిస్తూ జయహెూ ఇస్రో జయహో భారత్ నినాదాలు చేసి తమ హర్షాన్ని వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు షంషీర్ ఖాన్, విజయకుమారి, వేణురెడ్డి, కేశవులు వెంకటస్వామి, జయప్రకాశ్, దేవకీ, అన్నపూర్ణ దేవి, శుభలక్ష్మి పాల్గొన్నారు.

అటవీ భూముల ఆక్రమణపై

ఉన్నత స్థాయి విచారణ జరగాలి

ఎమ్మెల్యే గురజాల

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్ : పుంగనూరు నియోజకవర్గం పులిచెర్ల మండలంలో మంగళంపేట అటవీ ప్రాంతంలో మాజీ రాష్ట్ర మంత్రి, వైసిపి నాయకుడు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అటవీ భూముల ఆక్రమణలపై ఉన్నత స్థాయి విచారణ జరగాలని చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ డిమాండ్ చేశారు. గడిచిన ఐదేళ్ల కాలంలో అధికారాన్ని అడ్డం పెట్టుకొని అడ్డగోలుగా భూములు ఆక్రమించారని, రికార్డులను తారుమారు చేశారని, అసైన్డ్, అటవీ భూములను ఆక్రమించుకొని విలాసవంతమైన వ్యవసాయ క్షేత్రాలు, భవనాలు నిర్మించుకొవడం చూస్తుంటే.. వైసిపి పాలనలో మంత్రులు, బడా నాయకులు ఏ మేరకు అవినీతికి, అక్రమాలకు పాల్పడ్డారో వెలుగులోకి వస్తున్నాయన్నారు. అడవి మధ్యలో నిర్మించిన వ్యవసాయ క్షేత్రం, భూముల వ్యవహారంపై సమగ్ర విచారణ జరగాలని డిమాండ్ చేశారు. ప్రధానంగా అడవి మధ్యలో పట్టా భూములు ఎలా వచ్చాయి, రికార్డులు ఎలా సృష్టించారు, ఆన్లైన్లో ఎలా నమోదు చేశారు, ఎవరు నమోదు చేశారు మొత్తం వ్యవహారంపై సమగ్ర విచారణ జరిగితేనే అక్రమాలు వెలుగులోకి వస్తాయన్నారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర విచారణ చేయాలని ఎమ్మెల్యే కోరారు.

రూల్స్ అతిక్రమిస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ విజయ్ కుమార్ ఆధ్వర్యంలో మండల స్థాయి టాస్క్‌ఫోర్స్ కమిటీ ఆర్ఎంపి, పిఎంపిలతో బుధవారం సమావేశం నిర్వహించారు. డాక్టర్ మాట్లాడుతూ ఆర్ఎంపి, పిఎంపిలు రోగులకు ప్రథమ చికిత్స మాత్రమే చేయాలని, ఇంజక్షన్ వేయకూడదని, సిలైన్స్ ఎక్కించకూడదని, ఆపరేషన్ చేయకూడదని తెలిపారు. ఇలా ఎన్ని రూల్స్ పెట్టిన వీటన్నింటిని అతిక్రమిస్తున్నారని ఇకపై రూల్స్ అతిక్రమిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజేంద్ర బాలాజీ, ఎస్సై పరశు రాముడు, విఆర్ఓ భరణి, పంచాయతీ సెక్రెటరీ సదాశివయ్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పేరెంట్స్ టీచర్స్ సమావేశం

ప్రజాశక్తి- వెదురుకుప్పం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం పేరెంట్స్ టీచర్స్ సమావేశం జరిగింది. కళాశాల అభివృద్ధిలో పూర్వవిద్యార్థులతోపాటు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కూడా ప్రధాన భూమిక పోషిస్తారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.అన్నపూర్ణ శారద అన్నారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంత కీలకమైనదో తల్లిదండ్రుల పాత్ర కూడా అంతే కీలకమైనదని అన్నారు. తల్లిదండ్రులు తరచుగా కళాశాలకు విచ్చేసి తమ పిల్లలు కళాశాలకు సక్రమంగా వస్తున్నారా లేదా అని తెలుసుకోవాలన్నారు. ప్రస్తుత ప్రపంచంలో కంప్యూటర్ పరిజ్ఞానం అతి ముఖ్యమైనదని, కళాశాలలో ఎంపీ లాడ్స్ ఫండ్స్‌తో మంచి కంప్యూటర్ ల్యాబ్ ఏర్పాటు అయిందని దానిని విద్యార్థులు సక్రమంగా వినియోగించుకుని జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు. పేరెంట్స్ టీచర్స్ కమిటీ కోఆర్డినేటర్ డాక్టర్ వి. ప్రభాకరరావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీ ప్రసన్న లత, డాక్టర్ శంకర్ రెడ్డి, డాక్టర్ మంగళ గౌరీ పాల్గొన్నారు.

జాతీయ క్రీడలకు టెక్నికల్ టైం కీపర్‌గా కృష్ణయ్య

ప్రజాశక్తి- పూతలపట్టు: ఉత్తరాఖండ్‌లో ఫిబ్రవరి 4 నుండి 17వ తేదీ వరకు జరగనున్న 38వ జాతీయ నేషనల్ క్రీడలకు పూతలపట్టు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న పిడి కే. కృష్ణయ్య మోడరన్ పెంటాతలాన్ క్రీడాంశంకు సంబంధించి టెక్నికల్ టైంకీపర్‌గా వరసగా రెండోసారి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పీడీని పాఠశాల ప్రధానోపాధ్యాయులు డివైఈవో చంద్రశేఖర్, ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు మనోహర్, జిల్లా ఫిజికల్ డైరెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు రవీందర్ రెడ్డి, సిరాజ్ అహ్మద్ అభినందించారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడి

జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ

పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం: ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటలు సాగు చేస్తే అధిక దిగుబడి పొందవచ్చు అని చిత్తూరు జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ తెలిపారు. బుధవారం మండలంలోని చిన్న ఉయ్యూరు గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించి ఆ గ్రామంలో వ్యవసాయ పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి మురళి కృష్ణ మాట్లాడుతూ ప్రతి రైతు వారి భూములకు భూసారాన్ని పరిరక్షించుకోవాలని భూసారాన్ని బట్టి మందులు వాడుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో మండలం వ్యవసాయ అధికారి నర్మదా, అగ్రికల్చర్ అసిస్టెంట్ దిలీప్, రోజా, టిడిపి నాయకులు గుండయ్య, ఎమ్మెల్యే పిఏ లోకేష్, సురేష్ పాల్గొన్నారు.

టిడిపి నాయకుడు మృతి

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: మండలంలోని వెంగంవారిపల్లి గ్రామానికి చెందిన సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకులు వి.కోదండప్ప గౌడ్ (47) అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. కోదండప్ప మృతి పార్టీకి తీరని లోటు అని మండల అధ్యక్షులు కిషోర్ గౌడ్ అన్నారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. మండల కార్యదర్శి సుబ్రహ్మణ్యం శెట్టి, భువనచంద్ర గౌడ్, రాజశేఖర్, అంబరీ, కృష్ణమూర్తి, మంజునాథ్ గౌడ్, శేషు, వి.శంకరప్ప, రమేష్ రెడ్డి, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

ఏపీని అప్పుల ఊబిలోకి నెట్టేసిన జగన్ సర్కార్

పథకాల పేరుతో 10 లక్షల కోట్ల అప్పు: ఎంపి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: పాలనపై పట్టులేని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి అనాలోచిత నిర్ణయాలతో ఆంధ్రప్రదేశ్‌ను అప్పుల ఊబిలోకి నెట్టేసి, ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేశారని చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు వ్యాఖ్యానించారు. విభజిత రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాల్సిన వైసిపి నేత జగన్మోహన్ రెడ్డి 10లక్షల కోట్ల అప్పుచేసి, ఆంధ్రప్రదేశ్‌ను తిరోగమనం వైపు నడిపించారని విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో జగన్ చెల్లించని బకాయిలకు సంబంధించి, ఈ ఏడు నెలల కాలంలో ఆరోగ్యశ్రీ, ధాన్యం బకాయిలు, ఫీజు రీయంబర్స్మెంట్ వంటి వాటికి బకాయిలుగా ఉన్న 22వేల కోట్లను రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం చెల్లించిందని వివరించారు. అంతేకాకుండా 19,871.35 కోట్ల రూపాయలను నాటి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి జల్సాలకు దుబారా చేసినట్లు అధికారిక లెక్కలు తెలియజేస్తున్నాయని ఆయన అన్నారు. రాజ్యాంగబద్ధంగా పాలన చేయాల్సిన మాజీ సీఎం జగన్ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం పాలు చేసే విధంగా వ్యవహరించడం ఆయన దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమన్నారు. ఇకనైనా తన వైఖరి మార్చుకొని పనిచేసే ప్రభుత్వానికి సహకరించాలని, అలా కాదని ముందుకెళ్తే ప్రజా కోర్టులో మరోసారి గుణపాఠం తప్పదని ఎంపీ హెచ్చరించారు.

ప్రభుత్వానికి గుది బండలా జగన్ చేసిన అప్పులు: ఎమ్మెల్యే

పలమనేరు: జగన్మోహన్ రెడ్డి తన విలాసాలు, జల్సాలకు వేల కోట్ల ప్రజాధనాన్ని దుబారా చేశారని పలమనేరు శాసనసభ్యులు అమరనాథ రెడ్డి పేర్కొన్నారు. పలమనేరులోని తన కార్యాలయంలో బుధవారం మీడియా సమావేశంలో ఆయన పాల్గొన్నారు. జగన్ ఐదేళ్ల పరిపాలనలో 10 లక్షల కోట్ల అప్పు చేసి ఆర్థిక వ్యవస్థ దివాలా తీసే పరిస్థితి తీసుకొచ్చారన్నారు. గడిచిన ఏడు నెలలలో ఆరోగ్యశ్రీ, ధాన్యం బకాయిలు, ఫీజు రీయంబర్స్మెంట్ లాంటి జగన్ ప్రభుత్వ బకాయిలను రూ.22 వేల కోట్లను చంద్రబాబు ప్రభుత్వం చెల్లించిందన్నారు. అప్పులు కూడా పుట్టని స్థితి రాష్ట్రంలో ఏర్పడిందని ఏడాదికి రూ.71 వేల కోట్లు అసలు వడ్డీ చెల్లించాల్సి వస్తోందన్నారు. ఇవన్నీ ప్రస్తుత ప్రభుత్వానికి గుదిబండలా మారాయని వివరించారు. జగన్ రెడ్డి అనాలోచిత నిర్వాకంతో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ దివాలా తీసిందని ఇది ప్రస్తుత ప్రభుత్వానికి పెనుభారమై ప్రజల పాలిట శాపంగా మారిందని పేర్కొన్నారు.

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి

అవార్డు గ్రహీతలకు సన్మానం

అవార్డు గ్రహీతలను సన్మానిస్తున్న ఎంపీడీవో

ప్రజాశక్తి- ఐరాల: గణతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ ప్రతిభా పురస్కారాన్ని అందుకున్న ఐరాల మండల విస్తరణాధికారి కుసుమ కుమారి, సీనియర్ సహాయకులు ఈశ్వర్‌లను ఎంపిడిఓ ధనలక్ష్మి ఆధ్వర్యంలో బుధవారం సన్మానించారు. ఎంపిడిఓ మాట్లాడుతూ ఐరాల మండలంలోని ఇద్దరు అధికారులకు అవార్డు రావడం సంతోషంగా ఉందన్నారు. అందరూ ఉద్యోగులు విధి నిర్వహణలో నిబద్ధతతో ఉండాలన్నారు. ఈఓపిఆర్‌డి కుసుమ మాట్లాడుతూ అందరి సహకారం వలనే ఈ అవార్డు వచ్చిందని, అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

స్థల ఆక్రమణ.. మహిళ పై దాడి

ప్రజాశక్తి- గుడిపల్లి: మండలంలోని కుప్పిగానిపల్లి గ్రామానికి చెందిన పాపనాశమ్మ స్థలాన్ని స్థానిక వీఆర్ఏ బాలు ఆక్రమించుకున్నాడని గతంలో ఆమె కోర్టులో కేసు వేయడం జరిగింది. కోర్టులో ఆమెకే అనుకూలంగా తీర్పు రావడంతో సుమారు నాలుగు సెంట్లు స్థలంపై పూర్తి హక్కు పొందింది. కానీ సదరు వీఆర్ఏ ఆ స్థలంలో దౌర్జన్యంగా ఇంటి నిర్మాణ పనులు చేపట్టడం జరిగింది. ఈ విషయం తెలుసుకున్న ఆమె అక్కడికి వెళ్లి ఈ స్థలం నాది అని అడగడంతో వీఆర్ఏ కుటుంబ సభ్యులు ఆమెపై దాడి చేయడంతో ఆమెకు రక్త గాయాలయ్యాయి. దీంతో ఆమె వారి కుటుంబ సభ్యులు స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసి తనకు న్యాయం చేయాలని కోరారు. ఈ విషయంపై విచారణ చేసి రెవెన్యూ శాఖతో సంప్రదించి న్యాయం చేస్తానని ఎస్సై శ్రీనివాసులు తెలిపారు.

వ్యాయామం తప్పనిసరి

ప్రజాశక్తి- గుడిపాల: పిల్లలు చదువుతోపాటు వ్యాయామం కూడా తప్పనిసరిగా చేస్తేనే ఆరోగ్యకరంగా ఉంటారని గుడిపాల పీహెచ్సి డాక్టర్ చంద్రమోహన్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని నరహరిపేట ఉన్నత పాఠశాల ఆవరణంలో భవితా కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ పిల్లలు ప్రతిరోజు పాఠశాలకు క్రమం తప్పకుండా రావడంతో పాటు వ్యాయామం, యోగా, మెడిటేషన్ ఇలాంటివి చేయాలని సూచనలు ఇచ్చారు. అనంతరం సిబ్బందితో కలిసి విద్యార్థులను వైద్య పరీక్షలు చేశారు. భవిత కేంద్ర ఉపాధ్యాయురాలు వాణిశ్రీ, భబిత పాల్గొన్నారు.

ఉచిత పశు వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి- పెద్దపంజాణి: మండలంలో ఉచిత పశువైద్య శిబిరానికి స్పందన బాగుందని పశువైద్యాధికారిని డాక్టర్ సరిత అన్నారు. బుధవారం పెద్దపంజాణి, లింగాపురం పంచాయతీలలో వెటర్నటీ ఆసుపత్రి పరిధిలో బుధవారం ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించినట్లు తెలిపారు. ఆమె మాట్లాడుతూ పశువులకు నట్టల నివారణ మందులు, పిడుదుల మందులు పిచికారి చేసినట్లు తెలిపారు. పశువులకు చూలు పరీక్షలు, ఎదకురాని పశువులను పరీక్షించి వాటికి కావాల్సిన మందులు పంపిణీ చేశామన్నారు. పాడి రైతులు తప్పనిసరిగా వారి పశువులకు ఇన్సూరెన్స్ చేసుకుంటే ప్రమాదవశాత్తు పశువులు మరణిస్తే ప్రభుత్వం నష్టపరిహారం చెల్లిస్తుందని, ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ వైద్య శిబిరంలో 450 పశువులకు బూటాక్స్ స్ప్రే 150 పశువులకు నట్టల నివారణ మందులు పంపిణీ చేసినట్లు తెలియజేశారు. సర్పంచులు జాఫర్, చలపతి, డాక్టర్ సరిత, డాక్టర్ వనిత కుమారి, శంకర్, సిబ్బంది పాడి రైతులు పాల్గొన్నారు.

గుడిపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ఆదేశానుసారం ఈనెల 31 ఒకటో తేదీ వరకు మండలంలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు గుడిపల్లి మండల పశు వైద్యాధకారీ ఆమని తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం కొత్తపల్లి గ్రామంలో నిర్వహించి వైద్యశిబిరంలో పశువులకు వ్యాధి నిరోధక టీకాలు, నట్టల నివారణ, గర్భకోశ వ్యాధుల నివారణ కొరకు టీకాలు వేయడంతోపాటు ఉచితంగా మందులు అందించారు. పాడి రైతులు ఉచిత పశు వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకుని పాడి పశువులను, మేకలు, గొర్రెలు, పెంపుడు కోళ్లను సంరక్షించుకోవాలని కోరారు.

పల్లెల్లో వరి 'కోతల జాతర'

ప్రజాశక్తి- శ్రీకాళహస్తి: తూర్పు మండలాల్లోని పల్లెల్లో వరి కోతల జాతర మొదలైంది. రబీలో వేసిన వరి పంటలు కోతకు రావడంతో రైతులు పెద్ద ఎత్తున ఒబ్బిళ్లు చేస్తున్నారు. సాధారణంగా తూర్పు మండలాల్లో మార్చి, ఏప్రిల్ మాసాల్లో వరి పంటలు కోతకు వస్తుంటాయి. అయితే ఈ సారి రైతులు రబీ ప్రారంభ దశలోనే నాట్లు వేయడంతో జనవరిలోనే కోతకు వచ్చిన పరిస్థితి. అయితే జనవరిలో బంగాళాఖాతంలో చోటు చేసుకున్న వరుస అల్ప పీడనాల ప్రభావంతో కురిసిన వర్షాలకు వరి కోతలు వాయిదా పడ్డాయి. ప్రస్తుతం వర్షాలు తగ్గుముఖం పట్టాక వరి పొలాల్లో సాధారణ పరిస్థితులు నెలకొనడంతో రైతులు కోతలకు ఉపక్రమించారు. ఒక్కో ఆయకట్టు పరిధిలో ఐదు అంతకుమించి వరికోత యంత్రాలు కోతలకు దిగడంతో జాతరను తలపిస్తోంది.

సోషల్‌మీడియా ప్రతినిధులపై పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు

ప్రజాశక్తి - తిరుమల: ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచన కర్త డాక్టర్ చాగంటి కోటేశ్వరరావుకు తిరుమలలో అవమానం జరిగిందంటూ ప్రచారం చేసిన సోషల్ మీడియా ప్రతినిధులపై పోలీసు స్టేషన్‌లో టిటిడి ఫిర్యాదు చేసింది. హైదరాబాద్ కేంద్రంగా ఉన్న డయల్‌న్యూస్, పోస్ట్ 360, జర్నలిస్టు వైఎస్ఆర్ నిర్వాహకులపై తిరుపతి యూనివర్సిటీ పోలీసు స్టేషన్‌లో మంగళవారం కేసు నంబర్ 13/2025గా నమోదయ్యింది. చాగంటి కోటేశ్వరరావు తిరుమల పర్యటనపై వాస్తవ సమాచారాన్ని సోషల్ మీడియా ద్వారా టిటిడి వెల్లడించినా సదరు సోషల్ మీడియా ప్రతినిధులు టిటిడి ప్రతిష్టను దెబ్బతీసేలా వాస్తవాలను వక్రీకరించి దురుద్దేశంతో అవాస్తవాలను ప్రచారం చేశారని టిటిడి పేర్కొంది. న్యూఢిల్లీ, విజయవాడలోని పిఐబి (ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో)కు, సోషల్ మీడియా సంస్థల లైసెన్స్‌లను రద్దు చేయాలని యూట్యూబ్ మేటా మేనేజ్‌మెంట్‌కూ ఫిర్యాదు చేసింది. వాస్తవానికి డాక్టర్ చాగంటి కోటేశ్వరరావు జనవరి 14న శ్రీవారి దర్శనం, 16న మహతి ఆడిటోరియంలో ప్రవచనాలు ఇచ్చేందుకు డిసెంబర్ 20న టిటిడి ప్రొసీడింగ్స్ ఇచ్చింది. వారికి ఉన్న క్యాబినెట్ ర్యాంకు ప్రోటోకాల్ ప్రివిలేజ్ ప్రకారం 14న శ్రీవారి దర్శనం ఏర్పాట్లను చేసింది. రాంబగీచా గెస్ట్‌హౌస్ నుంచి శ్రీవారి ఆలయానికి తీసుకెళ్లేందుకు బ్యాటరీ వాహనాలను, శ్రీవారి ఆలయానికి బయోమెట్రిక్ ద్వారా అనుమతించేందుకు టిటిడి ఏర్పాట్లను చేసింది. అయితే ఏర్పాట్లను ఆయన సున్నితంగా తిరస్కరించి, సామాన్య భక్తుల తరహాలోనే వైకుంఠం క్యూకాంప్లెక్స్ నుంచరి శ్రీవారి ఆలయానికి చేరుకుంటానని స్వయంగా చెప్పారు. జనవరి 8న తిరుపతిలో జరిగిన తోపులాట ఘటన నేపథ్యంలో చాగంటి ప్రవచన కార్యక్రమాన్ని వాయిదా వేస్తే బాగుంటుందని వారి దృష్టికి టిటిడి ఉన్నతాధికారులు తీసుకెళ్లగా వారు అంగీకరించారు.

ఎస్ఎఫ్‌ఐ అధ్యక్ష కార్యదర్శులుగా అక్బర్, రవి

ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా నూతన కమిటీతో రాష్ట్ర అధ్యక్షులు ప్రసన్నకుమార్

ప్రజాశక్తి - క్యాంపస్: భారత విద్యార్థి ఫెడరేషన్ తిరుపతి జిల్లా మహాసభ రెండో రోజు 21 మందితో జిల్లా కమిటీ ఎన్నికయ్యిందని రాష్ట్ర అధ్యక్షులు ప్రసన్నకుమార్ వెల్లడించారు. జిల్లా ప్రధాన కార్యదర్శిగా భగత్‌రవి, జిల్లా అధ్యక్షులుగా అక్బర్, ఉపాధ్యక్షులుగా అశోక్, వినోద్, తేజ, సహాయ కార్యదర్శులుగా ప్రవల్లిక, బాల, ఉమేష్, గుటువయ్య తదితరులతో 21 మందితో నూతన కమిటీ ఎన్నికయ్యింది. రాష్ట్రాల హక్కులను హరించే యుజీసీ ముసాయిదాను రద్దు చేయాలని, ఖాళీగా ఉన్న ప్రొఫెసర్ పోస్టులు భర్తీ చేయాలని, ఉమ్మడి ప్రవేశ పరీక్షల విధానాన్ని రద్దు చేసి, ఆయా యూనివర్సిటీల ప్రవేశ పరీక్షల విధానాన్ని కొనసాగించాలని, యూనివర్సిటీల స్వయం ప్రతిపత్తి కాపాడాలని, పెండింగ్ ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలని మహాసభ డిమాండ్ చేసింది. యూనివర్సిటీ పరిశోధక విద్యార్థులకు నాన్‌నెట్ ఫెలోషిప్ 15వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తిరుపతి, చంద్రగిరిలో ప్రభుత్వ జూనియర్, డిగ్రీ, పీజీ కళాశాలలు ప్రారంభించాలన్నారు. సంక్షేమ హాస్టల్స్‌కు సొంత భవనాలు ఏర్పాటు చేయాలన్నారు.

మంద కృష్ణ మాదిగకు పద్మశ్రీ పై సంబరాలు

ప్రజాశక్తి - రామకుప్పం: ఏమార్పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ పద్మశ్రీ అవార్డు రావడంపై రామకుప్పంలో ఆ సంఘం సభ్యులు ఆటో కూడలి నుండి ఆయన చిత్రపటాన్ని తీసుకుని ర్యాలీగా సాగి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహంకు పూలమాల వేసి సంబరాలు జరుపుకున్నారు. మంద కృష్ణ మాదిగకు కేంద్ర ప్రభుత్వం 76వ గణతంత్ర దినోత్సవం రోజున పద్మశ్రీ అవార్డు ఇచ్చిన శుభసందర్భంగా కుప్పం నియోజకవర్గ ఎంఎస్పి సీనియర్ నాయకులు వెంకటేష్ మాదిగ, రామకుప్పం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఇంచార్జ్ రాజ్ కుమార్, మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి చిత్తూరు జిల్లా అధ్యక్షులు ప్రకాష్ మాదిగ, పాపన్న, సుబ్రహ్మణ్యం, జయప్ప తదితరులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE HON'BLE CIVIL JUDGE (JUNIOR DIVISION):: PALAMANER
O.S.No. 119 of 2023
Between:
IDBI Bank Ltd., (IDBI Bank), Palamaner Branch, reptd. by its Branch Head/Branch Manager, Palamaner ...**Plaintiff**
And
G.Balakrishna and others ...**Defendant**
NOTICE
To: Defendants 2 and 3
1. G.Selvaraj, S/o.G.Thippanna,
2. Smt.Nagalakshmi, W/o.Ganesh & D/o.G.Thippanna, Both residing at D.No.9-75, Egaveedhi, Kolamasanpalle Village and Post, Palamaner Town, Post and Mandal, Chittoor District.
Whereas the above suit filed by the plaintiff bank against you for recovery of the suit amount of Rs.98,086 with further interest and costs is posted to 25.02.2025 for your notice. If you have any objection, you can file the same in person or through your counsel on 25.02.2025 at 10:30 AM in the above case before this Hon'ble court, failing which the matter will be decided in your absence.
S/d P. PARAMASIVAPPA
ADVOCATE FOR PLAINTIFF

IN THE COURT OF THE HON'BLE CIVIL JUDGE (JUNIOR DIVISION):: PALAMANER
O.S.No. 171 of 2024
Between:
Canara Bank, ('e' Syndicate Bank), Gangavaram Branch, reptd. by its Branch Manager, Gangavaram ...**Plaintiff**
And
P.Ramesh ...**Defendant**
NOTICE
To: P.Ramesh, S/o.P.Venkatappa, Hindu, Business, residing at D.No.7-64, Sai Nagar, Gangavaram Village, Post and Mandal, Chittoor District.
Whereas the above suit filed by the plaintiff bank against you for recovery of the suit amount of Rs.15,376/- with further interest and costs is posted to 27.02.2025 for your notice. If you have any objection, you can file the same in person or through your counsel on 27.02.2025 at 10.30 AM in the above case before this Hon'ble court, failing which the matter will be decided in your absence.
S/d P. PARAMASIVAPPA
ADVOCATE FOR PLAINTIFF

క్రైం న్యూస్

విద్యుత్ షాక్‌తో రైతు మృతి

మృతుడు అల్లాబక్షు (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి - సదుం: మండల పరిధిలోని అమ్మగారిపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని ఎగువ జాండ్రపేటకు చెందిన రైతు పీర్ల అల్లాబక్షు (57) విద్యుత్ షాక్‌తో తన పొలం వద్ద మరణించిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. సదుం ఎస్సై షేక్ షావలి తెలిపిన కథనం మేరకు.. పీర్ల అల్లా బక్షు తాను వ్యవసాయం చేస్తున్న పొలం దగ్గర, కలకటవారిపల్లి మాదిగపల్లికి చెందిన గచ్చుల శ్రీనివాసులు వ్యవసాయ క్షేత్రంలో ఏర్పాటు చేసుకున్న రేకుల షెడ్డులో అమర్చిన విద్యుత్తు వైర్లు తగలడంతో విద్యుదాఘాతానికి గురై బుధవారం ఉదయం మరణించినట్లు తెలిపారు. ఎస్ఐ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మృతుడు కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుడు వ్యవసాయంతోపాటు పొట్టేళ్లు మేపుకుంటూ జీవనం సాగించేవాడని, ఇతనికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారని తెలిపారు.

హత్య కేసులో నిందితుల అరెస్టు

విలేకర్ల సమావేశంలో నిందితులను చూపుతున్న డీఎస్పీ

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: వృద్ధురాలిని హత్య చేసిన నిందితులను అరెస్ట్ చేసినట్టు డీఎస్పీ ప్రభాకర్ తెలిపారు. బుధవారం పోలీస్ స్టేషన్లో విలేకరుల సమావేశం నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ ఈనెల 19న మండలంలోని ఆర్ఆర్ నగర్‌లో వృద్ధురాలు అనుమానాస్పద స్థితిలో మృతిచెంది ఉండటం గుర్తించిన ఆమె కుమారుడు సంతోష్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు చేశారు. ఈమేరకు సీఐ శ్రీనివాసులు కేసు నమోదు చేసి శవపరీక్ష చేపట్టి కేసును దర్యాప్తు చేపట్టారు. ఆర్ఆర్ నగర్‌లోని నివాసముంటున్న రాజేంద్ర నాయుడు భార్య సునందమ్మ ఇంటి చుట్టుపక్కల గల వారి వేలు ముద్రలను సేకరించి అందులో పలమనేరు టౌన్ రాజశేఖర్, భార్య దుర్గ వేలిముద్రలు సరిపోవడంతో ఆమెను అదుపులోకి తీసుకుని విచారించారు. అలాగే మరో నిందితుడు పలమనేరు మండలం ముసలమడుగు గ్రామానికి చెందిన దామోదర్ నాయుడు కుమారుడు లీలా మనోహర్‌ను కూడా బుధవారం పాలేరు ఫ్లైఓవర్ వద్ద వారిని అదుపులో తీసుకున్నారు. దుర్గ, లీలా మనోహర్ ఇద్దరు సునందమ్మకు ఊపిరి ఆడకుండా అదిమిపెట్టి మృతి చెందిందని నిర్ధారించుకుని ఆమె ఒంటి పైన బీరువాలో గల 176 గ్రాముల బంగారు నగలు అపహరించారు. దుర్గా పేరుతో కొద్దిగా మనోహర్ పేరుతో కొద్దిగా తాకట్టు పెట్టికున్నట్లు నేర అంగీకరించారు. అనంతరం ఇరువురిని కోర్టుకు తరలించి జైలుకు పంపనున్నట్టు తెలిపారు. ఈ కేసులో నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన సీఐ శ్రీనివాసు బృందానికి అభినందనలు తెలిపారు. ఏఎస్ఐలు మల్లప్ప, వల్లెమ్మ, రామచంద్రారెడ్డి, కానిస్టేబుల్ కిరణ్, మోహన్, పురుషోత్తం పాల్గొన్నారు.

దళితుడి మృతిపై కేసు నమోదు

ప్రజాశక్తి - సదుం: మండల పరిధిలోని నడిగడ్డ గ్రామపంచాయతీ, మాదిగపల్లికి చెందిన రమణయ్య మృతి పట్ల భార్య నరసమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పవన్ కుమార్ రెడ్డి అనే వ్యక్తిపై ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేసినట్టు సదుం ఎస్సై షేక్ షావలి బుధవారం విలేకరులకు తెలిపారు. దర్యాప్తు చేస్తున్నామని చట్టం ప్రకారం ముద్దాయిని అరెస్టు చేస్తామని ఆయన తెలిపారు.

బైక్ దొంగ అరెస్టు

ఏడు వాహనాలు స్వాధీనం

ప్రజాశక్తి- కార్వేటినగరం: ప్రభుత్వ కార్యాలయాల వద్ద అధికారులు పార్కింగ్ చేసిన ద్విచక్రవాహనాలను చోరీ చేసిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు నగరి డీఎస్పి ఎస్.ఎండీ అజీజ్ తెలిపారు. బుధవారం స్థానిక పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్వేటినగరం సర్కిల్ పరిధిలోని వెదురుకుప్పం మండలం తిరుమలయ్యపల్లి పంచాయతీ వావిళ్ల చేను గ్రామానికి చెందిన సుబ్రమణ్యం కుమారు వై.చంద్రబాబు బైక్ మెకానిక్‌గా పనిచేస్తూ ప్రభుత్వ కార్యాలయాల వద్ద అధికారులు పార్కింగ్ చేసిన వాహనాలను ఎంచుకుని తన సొంత ద్విచక్రవాహనంలో వచ్చి తన వాహనాన్ని అక్కడే ఉంచి అతను ఎంచుకున్న వాహనాన్ని అపహరించే వాడని, అనంతరం తన వాహనాన్ని తీసుకెళ్లి తక్కువ ధరలకే అమ్మి సొమ్ము చేసుకుని జల్సాలకు పాల్పడుతూవచ్చాడని తెలిపారు. చోరీకి గురైన వాహన యజమానులు ఇచ్చిన పిర్యాధు మేరకు సీసీ పుటేజీలను పరిశీలించామని వాహనాల దొంగతనానికి పాల్పడుతున్న చంద్రబాబును కొల్లాగుంట చెక్పోస్టు వద్ద సిఐ హనుమంతప్ప, ఎస్ఐ రాజ్ కుమార్ తమ సిబ్బందితో కలిసి వాహనాలు తనిఖీ చేస్తుండగా పోలీసులను గుర్తించి పరారీ అయ్యేందుకు యత్నించాడని దీంతో చంద్రబాబును అదుపులోకి తీసుకు విచారణ చేపట్టడంతో ఆరు వాహనలను చోరీ చేసినట్లు నిందితుడు అంగీకరించినట్లు డీఎస్పీ వెల్లడించారు. ఈ వాహనాలు 1 లక్ష 25 వేల రూపాయలని విలువ చేస్తుందని తెలిపారు. ఈ కేసు దర్యాప్తులో కృషి చేసిన పోలీస్ సిబ్బందికి డీఎస్పీ రివార్డును అందించి, సిఐ హనుమంతప్ప, ఎస్ఐ రాజ్ కుమార్‌ను అభినందించారు. గ్రామాల్లో సారా అమ్మకాలు, గంజాయి వంటి అక్రమ వ్యాపారాలు జరుగుతున్నట్లు తెలిసిన పోలీసులకు సమాచారం అందించి సహకరించాలని సూచించారు.

112 గ్రాముల బంగారం చోరీ

ప్రజాశక్తి - గంగాధర నెల్లూరు: గంగాధరనెల్లూరు గ్రామంలోని భానుప్రకాష్ రెడ్డి ఇంట్లో మంగళవారం చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన సమాచారం మేరకు.. గంగాధరనెల్లూరు గ్రామంలో నివాసముంటున్న సుబ్రమణ్యం రెడ్డి కుమారుడు భాను ప్రకాష్ రెడ్డి బెంగళూరులో సాఫ్ట్వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. గంగాధర నెల్లూరుకు అప్పుడప్పుడు వచ్చి వెళ్లే వారు. మంగళవారం ఉదయం ఎదురింటి వాళ్లు భానుప్రకాష్ రెడ్డి ఇంటికి తాళం లేకపోవడంతో పోలీసులకు, బెంగుళూరులో ఉంటున్న భానుకు సమాచారం అందించారు. దీంతో ఇంచార్జ్ సీఐ శ్రీనివాసంతి సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. భాను ప్రకాష్ రెడ్డి బుధవారం గంగాధరనెల్లూరుకు చేరుకుని ఇంట్లోని 112 గ్రాముల బంగారం, ఒక కేజీ వెండి చోరీ జరిగినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు.